సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 13 । జూన్ । 2023



వైద్య ఉద్యోగుల హర్షం

వైద్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 8లో ▸



నలుగురి అరెస్టు

యలమంచిలి మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేశారు. ఈ నెల 9న మేడపాడులో మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. 8లో ▸

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

విద్యుదాఘాతంతో పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం ఇద్దరు మృతిచెందారు. పోడూరు మండలం జిన్నూరులో వృద్ధురాలు, తణుకు మండలం పైడిపర్రులో అసిస్టెంట్ లైన్‌మేన్ దుర్మరణం చెందారు. 8లో



న్యూస్‌రీల్

స్పందన కేసులు సత్వరం పరిష్కరించాలి



భీమవరం డీఎస్పీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ యు.రవిప్రకాష్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు 21 ఫిర్యాదులు అందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధిపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఎస్పీ ఆదేశించారు.

వేణుమాధవరెడ్డికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి



కొవ్వూరి వేణుమాధవరెడ్డి

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం వెలగలేరు గ్రామానికి చెందిన విద్యావంతుడు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొవ్వూరి వేణుమాధవరెడ్డిని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు ఎనలేని కృషిచేశారు. సామాన్య కార్యకర్తగా ఉంటూ వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా ప్రతినిధిగా కూడా పనిచేస్తున్న వేణుమాధవరెడ్డిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 14న తాడేపల్లిలో జరిగే కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు వేణుమాధవరెడ్డి తెలిపారు.

15, 16 తేదీల్లో ఐటీఐ కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 15,16 తేదీల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రధానాధికారి పీ.రజిత తెలిపారు. ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలిపిన తేదీల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. 15న 7.5 నుంచి 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన 1 నుంచి 53 నెంబర్ విద్యార్థులకు ఉదయం 10 గంటలకు, 5.4 నుంచి 7.4 గ్రేడ్ పాయింట్లతో 54 నుంచి 107 మెరిట్ నెంబర్ గల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమౌతుందన్నారు. 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 4.5 నుంచి 5.3 వరకూ గ్రేడ్ పాయింట్లు గల 108 నుంచి 158 మెరిట్ నెంబర్‌గల వారికి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 0.5 నుంచి 4.4 గ్రేడ్ పాయింట్లతో 159 నుంచి 219 వరకూ మెరిట్ నెంబర్ గల విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

వేళాంగిణి మాత భక్తుల కోసం స్పెషల్ బస్సు

నూజివీడు: ఆగిరిపల్లి, ముసునూరు, నూజివీడు, చాట్రాయి మండలాలకు చెందిన వేళాంగిణి మాత భక్తుల కోసం ఈ నెల 17న ఉదయం 11 గంటలకు నూజివీడు నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. బస్సు 18న ఉదయానికి వేళాంగిణికి చేరుతుందన్నారు. ఆ రోజంతా అక్కడే ఉండి 19న ఉదయం బయలుదేరి చెన్నై చేరుకొని అక్కడి సెయింట్ థామస్ మౌంట్, మెరీనా బీచ్ చూసుకొని రాత్రికి బయలుదేరి 20వ తేదీ ఉదయానికి నూజివీడు చేరుతుందన్నారు. వివరాలకు 7382893197, 9959225461, 8074017930 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మినీ జాబ్ ఫెయిర్

ఏలూరు (టూటౌన్): నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరులోని డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈ నెల 13న మినీ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. ఈ మినీ జాబ్ ఫెయిర్‌లో టెక్ మహీంద్ర, మెహాన్ స్పింటెక్స్, అపోలో ఫార్మసీ, కేలిబార్, లాట్ మొబైల్స్, సీఎంఆర్ జ్యూయలర్ పతినిధులు పాల్గొంటారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్హతలు ఉండి, 18 నుండి 35 సంవత్సరాల వయసు వారు అర్హులని తెలిపారు.

వడిబడిగా తరగతులకు..

బడిగంటలు మోగిన వేళ విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు.. తరగతి గదుల్లో కూర్చుని సంబరపడ్డారు.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి తరగతులు ప్రారంభం కాగా.. 11.30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టి పిల్లలను ఉపాధ్యాయులు ఇంటికి పంపించారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



బడి గంట కొడుతూ..



ఏలూరు కస్తూరిబా నగరపాలకోన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు



తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తొలి రోజే విద్యాకానుక

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యాకానుక పంపిణీ
- పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, బెల్టులు అందజేత



పెదతాడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తూర్పుతాళ్లు హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి చదువుకు అవసరమైన అన్ని వస్తువుల్ని జగనన్న ప్రభుత్వం అందజేస్తుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా పాఠశాలలు తెరిచిన తొలి రోజునే విద్యార్థులకు విద్యాకానుక అందచేశారు. చెప్పాడంటే చేస్తాడంతే అని ప్రజల్లో పూర్తి స్థాయిలో విశ్వసనీతయను పెంచుకున్న ముఖ్యమంత్రి మరోసారి తనమాటను నిలబెట్టుకుంటూ విద్యాకానుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్ తమ పరిధిలో ఈ కార్యక్రమాన్ని భారీస్థాయిలో నిర్వహించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం నింపారు. తొలిరోజు సాధ్యమైనంత మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో విద్యార్థులందరికీ అందించే వరకూ కొనసాగించనున్నారు.

విద్యాకానుక అందజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యాకానుక అందించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొని విద్యాకానుక అందచేశారు. నరసాపురం నియోజకవర్గంలోని తూర్పుతాళ్లులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని సీతంపేట మండల పరిషత్ పాఠశాలలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పెదపాడు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ పాల్గొని విద్యార్థులకు విద్యాకానుక అందజేశారు.

భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి పాల్గొన్నారు. కామవరపుకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, బుట్టాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్థానిక ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, ఉండి, పాలకోడేరు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ పాల్గొని విద్యాకానుక పంపిణీ చేశారు. అనేక ప్రాంతాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తమ ప్రాంతాల్లో విద్యాకానుకను తొలి రోజే అందజేశారు.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విద్యాకానుక పంపిణీ ఇలా..

ఏలూరు జిల్లాలో..	పశ్చిమ గోదావరిలో..
స్కూల్ బ్యాగులు 1,55,998, బెల్టులు 1,10,234, పుస్తకాలు 9,30,146, బూట్లు 1,57,244, యూనిఫాం 1,55,998, డిక్షనరీలు 1,40,079	స్కూల్ బ్యాగులు 1,13,584, బెల్టులు 78,474, పుస్తకాలు 7,24,406, బూట్లు 1,13,579, యూనిఫాం 1,13,579, డిక్షనరీలు 20,572

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

కలెక్టర్ ప్రశాంతి



భీమవరంలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేద విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో సోమవారం ఏర్పాటుచేసిన జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో ఆమె కలిసి పాల్గొన్నారు. పాఠశాలు ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక పేరుతో పుస్తకాలు, యూనిఫాం, బూట్లు వంటి తొమ్మిది రకాల వస్తువులు అందచేస్తున్నట్లు చెప్పారు. స్కూళ్ల ప్రారంభం రోజునే విద్యార్థులకు అన్నిరకాల వస్తువులు అందచేయడం దేశంలోనే బహుశా ఇదే మొదటిదని అన్నారు. బైజుస్ ద్వారా మెరుగైన విద్యను అందజేయడానికి చర్యలు తీసుకున్నామని దీనికి అవసమైన ట్యాబ్‌లను కూడా అందచేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చుకు వెనుకాడకుండా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ఇంగ్లీష్ మీడియం, బైజుస్ తరగతులను అందించడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు. విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్ష ఏపీసి పి.శ్యాంసుందర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, తహసీల్దార్ వై.రవికుమార్, డిప్యూటీ డీఈఓ డి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి విద్యార్థులతో పోటీపడేలా..

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ స్థాయి విద్యార్థులతో పోటీపడేలా విద్యావ్యవస్థలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తెస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారితకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. పాఠశాలల్లో వస్తున్న మార్పుల కారణంగా విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. ఆంగ్ల మాధ్యమ విద్యను చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి వారు అడ్డుకోవడానికి చూశారన్నారు. వారు పిల్లలు మాత్రం కార్పొరేట్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు గ్లోబల్ విద్యార్థులతో పోటీ పడాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగడానికి వారానికి ఆరు రోజులు ఆరు రకాల ఆహారాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్నారన్నారు. నేడు విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లకు క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉందన్నారు. దాదాపు రూ. 3 వేల విలువైన కిట్‌ను రూ.2400కు ప్రభుత్వం కొనుగోలు చేసి, విద్యార్థులకు అందిస్తుందన్నారు.

చంద్రబాబు అబద్ధాల కోరు

దుర్మార్గుడు, అబద్ధాల కోరు, మోసగాడు ఎవడైనా ఉన్నాడంటే అది చంద్రబాబు అని, ఆ కేటగిరీలో చంద్రబాబుకు నోబెల్ ప్రైజ్ దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో జగన్ నవరత్నాలు ప్రకటిస్తే అమలు సాధ్యం కాదని ఎద్దేవా చేశారని.. నవరత్నాలులో ఏ హామీనైనా జగన్ వదిలేశారా? అని ప్రశ్నించారు. ఇవ్వని హామీలను సైతం అమలు చేసి చూపించారన్నారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న జాయింటు కలెక్టరు

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా చక్కని పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి రోజూ ఒక గంట ఫిర్యాదులపై దృష్టి పెట్టి పరిష్కరిస్తే సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందని అన్నారు. స్పందన కార్యక్రమంలో విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, పౌరసరఫరాలు, దేవాదాయ, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్యం, రోడ్లు భవనాల శాఖ, భూ వివాదాలు, వయో వృద్ధులకు సంబంధించిన సమస్యలకు సంబంధించి 190 దరఖాస్తులు వచ్చాయని, త్వరితగతిన పరిష్కరించాలని జాయింటు కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రైనీ కలెక్టరు డి.అఖిల, జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.

రూ.4.25 కోట్లతో దానేశ్వరి ఆలయ పునర్నిర్మాణం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



దానేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న దానేశ్వరి అమ్మవారి ఆలయాన్ని రూ.4.25 కోట్ల అంచనాతో దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం సాయంత్రం దువ్వ గ్రామంలోని ఆలయ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులతో ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలను చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ గర్భాలయాన్ని రూ.కోటి వ్యయంతో రాతితో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం

దానేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ. 25 లక్షలు విరాళం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామికవేత్త భోగవల్లి శ్రీమన్నారాయణ, వ్యాపారవేత్తలు నంద్యాల కృష్ణమూర్తి, పప్పుసింగ్ తదితరులు ఆలయ నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణ, సర్పంచ్ అడ్డా బాబు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, పెన్మత్స సీతారామచంద్రరాజు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, డీఈ ఉదయభాను, స్తపతి నెహ్రూ, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే దువ్వ గ్రామానికి చెందిన కడియం రాంబాబుకు సబ్సిడీతో కూడిన ట్రాక్టర్‌ను మంత్రి అందజేశారు.

16న జంగారెడ్డిగూడెంలో క్యాంపస్ డ్రైవ్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్ ఏపీ, హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 9 గంటలకు జంగారెడ్డిగూడెంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు సోమవారం తెలిపారు. అభ్యర్థులకు ప్రముఖ కంపెనీ హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం పొందేందుకు ఇది ఉత్తమ అవకాశమని చెప్పారు. ఇంటర్ 2022 లేదా 2023లో పూర్తి చేసిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంకు అర్హులన్నారు. అభ్యర్థులు ముందుగా హెచ్‌సీఎల్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. హాజరైన అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఆన్‌లైన్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హెచ్‌సీఎల్ నుంచి టెక్ బీలో ప్రోగ్రాంలో చేరేందుకు ఆఫర్ లెటర్ పొందుతారని, అనంతరం ట్రైనింగ్‌లో ఇంటర్న్‌షిప్ కోసం విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరులోని హెచ్‌సీఎల్ క్యాంపస్‌లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసి ఉద్యోగిగా మారిన అనంతరం సంవత్సరానికి రూ.1.72 లక్షల నుంచి రూ.2.2లక్షల జీతాన్ని పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు 96663 22032, 96525 03799 నెంబర్లలో తమను సంప్రదించాలన్నారు.

ఉత్తమ రైతులకు పురస్కారాలు

గుంటూరు రూరల్: పోషకాలతో కూడిన వంగడాల తయారీకి శాస్త్రవేత్తలు కృషిచేయాలని పీపీవీఎఫ్ఆర్ఏ (పొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీ ఫార్మర్స్ రైట్ యాక్టు) చైర్మన్ డాక్టర్ త్రిలోచన్ మొహపాత్ర పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గుంటూరు నగర శివారుల్లోని లాంఫాంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేసిన 415 రకాల విత్తనాల ప్రదర్శన, విత్తన విక్రయ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 11 మంది ఉత్తమ రైతులకు, 8 మంది శాస్త్రవేత్తలకు, చెరకు పరిశ్రమల విభాగంలో ఇద్దరికి అవార్డులను అందజేశారు. వీరిలో ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం సింగరాజుపాలెంకు చెందిన గద్దె అపర్ణ, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన దొండపాటి శ్రీనివాసరావును ఉత్తమ రైతు అవార్డులు వరించాయి.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పోలవరంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని జగన్నాథపేటలోని రావిచెట్టు వద్ద సోమవారం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వీఆర్వో, పంచాయతీ సిబ్బంది సహకారంతో సీహెచ్‌సీలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడిని గుర్తిస్తే పోలవరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు.

భవనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 10న రాత్రి మద్యం తాగి ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నాగిడిపాలెం గ్రామానికి చెందిన తిరుమాని గోవిందరాజు (46) ఈ నెల 10న రాత్రి మద్యం తాగి ఇంట్లో ఉక్కబోతగా ఉండటంతో తన భవనం పైన నిద్రించేందుకు వెళ్లాడు. తెల్లవారుజామున భార్య దుర్గాభవాని తన భర్త గోవిందరాజు కిందపడి పోయి మృతి చెందాడని గుర్తించింది. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై సంజీవ రావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ఆశయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వైద్య ఉద్యోగులు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైద్య శాఖ ఉద్యోగులు, చిత్రంలో మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం అర్బన్: ఉద్యోగుల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆశయమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. వైద్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి కొట్టు క్యాంపు కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ ఈనెల 7న నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులకు మేలు చేసే విధంగా పలు నిర్ణయాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి రిటైర్ అయిన అనంతరం గ్యారెంటీ పెన్షన్ స్కీం విధానాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ పద్ధతిని తీసుకురావడం ద్వారా ఉద్యోగులలోను, రిటైర్ ఉద్యోగులలోను ఆనందం వ్యక్తం అవుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన 2014లో జూన్‌కు ముందు ఐదు సంవత్సరాలు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఉన్న వారందరినీ పర్మినెంట్ చేస్తూ ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ కారణంగా రాష్ట్ర బడ్జెట్‌పై అదనంగా ఆర్థికభారం పడినా ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైద్య ఉద్యోగులు ఎస్.ప్రసాద్‌బాబు, ఎం.సాయిబాబా, ఆర్.పార్థసారథి, వై.నరేంద్ర, జి.సురేష్‌బాబు, బి.రామకృష్ణ, డీవీ రమణబాబు, జల్లా వీరభద్రరావు, మోగంటి ఉమామహేశ్వరరావు, ఎం.తేజునాథ్, వి.బాబూజీ, ఎస్.గణపతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఇద్దరి దుర్మరణం

పశ్చిమగోదావరి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఇద్దరు దుర్మరణం చెందారు. తణుకు మండలం పైడిపర్రులో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ లైన్‌మేన్ మృతి చెందగా, పోడూరు మండలం జిన్నూరు శివారులో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఓ వృద్ధురాలు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది.

● పైడిపర్రులో అసిస్టెంట్ లైన్‌మేన్ దుర్మరణం

తణుకు: స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై ఓ అసిస్టెంట్ లైన్‌మేన్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తేతలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మేన్‌గా పనిచేస్తున్న రావిపాటి నాగబాబు (45) తణుకు మండలం పైడిపర్రులో సోమవారం విద్యుత్ స్తంభం ఎక్కి లైన్లు మరమ్మతులు చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందపడిపోగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుణ్ని తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగబాబు ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో నివాసం ఉంటుండగా ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగబాబు మృతదేహానికి తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం కారణంగానే నాగబాబు మృతి చెందినట్లుగా తోటి సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉందని విద్యుత్‌శాఖ ఏడీఈ రామకృష్ణ వెల్లడించారు.

● జిన్నూరు శివారులో వృద్ధురాలు

పోడూరు: పంటకాలువలో పడిన కొబ్బరికాయలు తీసుకునే ప్రయత్నంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ఓ వృద్ధురాలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. జిన్నూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు కవురు సూర్యాకాంతం (65) జిన్నూరు శివారులో ఉన్న కొబ్బరితోటలో రాలిన కొబ్బరికాయలు తీసుకునేందుకు రోజు మాదిరిగానే సోమవారం వెళ్లింది. తోటపక్కనే ఉన్న పంట కాలువలో రాలిన కొబ్బరికాయలను బయటకు తీయడానికి ప్రయత్నించింది. అయితే పంటకాలువ పక్కనే వెళ్లిన విద్యుత్‌లైన్‌కు సంబంధించిన విద్యుత్ వైరు తెగిపడి ఉన్న విషయాన్ని ఆమె గమనించలేదు. కొబ్బరికాయలు తీసే ప్రయత్నంలో ఆ విద్యుత్ వైరును తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త గంగాచలం, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాద ఘటనపై స్థానిక ఎస్సై డి.రామ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అసిస్టెంట్ లైన్ మేన్ నాగబాబు మృతదేహం



కవురు సూర్యాకాంతం (ఫైల్)

అక్రమంగా మట్టి తరలించిన నలుగురి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: యలమంచిలి మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశామని నరసాపురం డీఎస్పీ కె.రవి మనోహరాచారి చెప్పారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న మేడపాడులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులను స్థానిక గ్రామస్తులు పట్టుకుని అధికారులకు అప్పగించారు. హౌసింగ్ కార్పొరేషన్ డీఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి గుమస్తాలైన విప్పర్తి రమేష్, కొల్లి సాయిబాబా, లారీ యజమాని మహేష్, లారీ డ్రైవర్ శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. జగనన్న కాలనీలో మట్టి పూడికకు సంబంధించి చించినాడలో ఓ ప్రాంతంలో మట్టిని తవ్వడానికి మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ మైనింగ్ శాఖ నుంచి అధికారికంగా అనుమతులు తెచ్చుకుంది. లారీల ఎగుమతి దిగుమతులకు సంబంధించి ట్రిప్పుల నమోదు కోసం విప్పర్తి రమేష్, కొల్లి సాయిబాబా అనే గుమస్తాలను మైత్రి సంస్థ ఏర్పాటు చేసింది. లారీ ట్రాన్స్‌పోర్టులో భాగంగా మొగల్తూరు మండలం జనసేన పార్టీకి చెందిన మహేష్ కుమార్ అనే వ్యక్తి మట్టి ట్రాన్స్‌పోర్టు నిమిత్తం మైత్రి సంస్థకు తన లారీని ఏర్పాటు చేశాడు. చించినాడ నుంచి నరసాపురం జగనన్న కాలనీకి మట్టి తరలిస్తుండగా మధ్యలో మేడపాడులో ఇటుకబట్టిల వద్ద ఓ మట్టి లోడు దించారు. ఈ విషయాన్ని గ్రామస్తులు గ్రహించి ఆ లారీని పట్టుకున్నారు. లారీ యజమాని మహేష్, డ్రైవర్ శ్రీనివాస్‌లను ప్రశ్నించగా మహేష్‌కు గతంలో రూ.50 వేలు నష్టం వచ్చిందని అది రికవరీ చేసుకోవడానికి ఇలా చేసినట్లు తెలిపాడన్నారు. విచారణ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, పూర్తిగా విచారణ జరిపి ఇంకా ఎన్ని ట్రిప్పులు మట్టి అనధికారికంగా విక్రయించారో దీని వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారో తెలియాల్సి ఉందన్నారు. రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, యలమంచిలి ఎస్సై జేవీఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మనోహరాచారి

నేడు చించినాడలో సమావేశానికి అనుమతులు లేవు

యలమంచిలి మండలంలో మంగళవారం లంక భూముల పోరాట కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సభ్యులు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసిందని డీఎస్పీ కె.రవి మనోహరాచారి చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని, దీంతో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలన్నా పోలీసులు అనుమతి ఉండాలన్నారు. ఈ నెలాఖరు వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందన్నారు.

గర్భిణి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

ఉండి: గర్భిణి హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ భీమవరం రెండో అదనపు జ్యూడీషియల్ కోర్టు సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై కె.గంగాధరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2016 సంవత్సరంలో వాండ్రం గ్రామానికి చెందిన కోనాల మౌనికకు సోడదాసి జాన్సన్ అనే వ్యక్తితో వివాహమైంది. ఒక కొడుకు కూడా ఉన్నాడు. వివాహమైన నాలుగేళ్ళ అనంతరం వివాదాల కారణంగా అతడి నుంచి విడిపోయింది. అనంతరం తుంపల ఆదినారాయణ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఆమె గర్భవతి కావడంతో తనను వివాహం చేసుకోవాలని అతడిపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చింది. ఈ క్రమంలో 2021లో వాండ్రం గ్రామ పరిధిలోని ఓ ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో పథకం ప్రకారం ఆమెను తీసుకువెళ్లి కత్తితో పొడిచి చంపాడు. ఆమె సోదరి చిన్నం సువార్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా సోమవారం భీమవరం రెండో అదనపు జ్యూడీషియల్ కోర్టు అతనికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: రాచర్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళల సమస్యలను వింటున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

97 వాహనాల వేలం.. రూ.14.75 లక్షల ఆదాయం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని నాలుగు రవాణా శాఖ కార్యాలయాల్లో ఉన్న 97 సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట నిర్వహించడం ద్వారా రూ.14,75,400 ఆదాయం వచ్చినట్లు జిల్లా రవాణాశాఖాధికారి టి.ఉమా మహేశ్వరరావు చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాహనాల వేలం వివరాలు తెలియజేశారు. భీమవరం రవాణా శాఖ కార్యాలయ పరిధిలో 24 వాహనాలు వేలం వేయగా రూ.1,88,200, తాడేపల్లిగూడెంలో 23 వాహనాల వేలం ద్వారా రూ.4,68,000, పాలకొల్లులో నాలుగు వాహనాలు వేలం ద్వారా రూ.1,01,700, తణుకులో 46 వాహనాల వేలం వేయగా రూ.7,17,500 ఆదాయం వచ్చిందన్నారు. వేలంలో ఎంవీఐలు ఎం.వెంకటేశ్వరరావు, జి.సంజీవ్ కుమార్, డీఎస్ఎస్ నాయక్, కె.జయపాల్‌రాజు పాల్గొన్నారని తెలిపారు.



జిల్లా రవాణాశాఖాధికారి టి.ఉమా మహేశ్వరరావు

ఎల్ఎన్‌డీ పేటలో విషాద ఛాయలు

పోలవరం రూరల్: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం పాలైన ఘటనలో మండలానికి చెందిన ఓ మహిళ, 9 నెలల కుమారుడు మృత్యువాత పడటంతో ఎల్ఎన్‌డీ పేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏలూరు జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన దాసరి శ్రావణి (25), దాసరి గగన్ (9 నెలలు) చిన్నారి ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆమె నాలుగు రోజుల క్రితం వెలిచర్లలో ఆడపడుచు ఇంటికి వెళ్లి అక్కడి నుంచి బంధువులతో కలిసి హైదరాబాద్ వెళ్లింది. తిరిగి కారులో బయలుదేరి రాజమండ్రి వస్తుండగా, సోమవారం వేకువజామున ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. శ్రావణికి ఇద్దరు పిల్లలు కాగా, ఒక కుమార్తెను అమ్మమ్మ ఇంట్లో ఉంచింది. భర్త సూరిబాబు ఎల్ఎన్‌డీపేట గ్రామంలో పాలవ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సూరిబాబు స్వగ్రామం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలోని పాత పైడిపాక గ్రామం. అతనికి పునరావాస కేంద్రంలో గృహం కూడా మంజూరయ్యింది. అయితే పాలవ్యాపారం నిమిత్తం అతడు ఎల్ఎన్‌డీపేటలో నివాసం ఉంటున్నాడు. ఈ ఘటన జరగడంతో ఎల్ఎన్‌డీపేటలోని బంధువులు, సన్నిహితులు శోకసంద్రంలో మునిగిపోయారు.

నిర్వాసితులకు పరిహారం కేంద్రమే భరించాలి

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని కేంద్రమే భరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ స్పష్టం చేశారు. సోమవారం కుక్కునూరులో పోలవరం ప్రాజెక్ట్ నిర్మించాలని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో జీపుయాత్ర ప్రారంభించారు. సమావేశంలో నారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా మోదీ అమరావతి శంకుస్థాపనకు మట్టి, నీరు ఇచ్చి రాష్ట్ర ప్రజలను అవమానపరిచారన్నారు. ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మున్నీర్, అరటికట్ల రవి పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి

కైకలూరు: కొన్ని గంటల్లో బడికి వెళ్లాల్సిన బాలుడిని చేపల చెరువు రూపంలో మృత్యువు బలిగొంది. ఈ విషాద ఘటన కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వేమవరప్పాడుకు చెందిన నాగమణితో నందివాడ మండలం తుమ్మలపల్లికి చెందిన నున్న నాగ ప్రసన్నకుమార్‌కు వివాహం జరిగింది. వీరికి ఉమామహేశ్వరి (10), మోక్షజ్ఞ చైతన్య (8) సంతానం. కొన్ని సంవత్సరాలుగా ప్రసన్నకుమార్ కుటుంబం వేమవరప్పాడులో అత్త ఇంటి వద్ద నివాసముంటున్నారు. మోక్షజ్ఞ కైకలూరు విజ్ఞాన్ కాలేజీలో 2వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో అక్కతో కలసి గోపాలపురం డొంకరోడ్డులో గేదెలను మోపడానికి వెళ్లాడు. అక్కడ గేదె చెరువులో దిగడంతో దానిని అదిలించడానికి వెళ్లి కాలుజారి చెరువులో పడ్డాడు. కేకలు వేయడంతో గమనించిన అక్క కొంతదూరంలో ఉన్న కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు పరుగున వచ్చి మోక్షజ్ఞను బయటకు తీసి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలుడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. బడికి వెళ్లడానికి అన్ని సిద్ధం చేశామని, ఇంతలోనే ఇంత ఘోరం జరిగిందని తల్లిదండ్రులు తల్లడిల్లారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం తుమ్మలపల్లికి మృతదేహాన్ని తరలించారు. తండ్రి ప్రసన్నకుమార్ ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ ఎస్సై జ్యోతిబసు అనుమానాస్పద మృతిగా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మోక్షజ్ఞ

క్లుప్తంగా

అమ్మవార్లకు గ్రామోత్సవం



అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురులో వేంచేసియున్న శ్రీ మావుళ్ళమ్మ మహాలక్ష్మి, పోతురాజు స్వామి వార్ల ఆషాడ మాస జాతర మహోత్సవాల్లో భాగంగా రాయకుదురు సోమవారం అమ్మవార్లను పూరిపాకకు తీసుకువచ్చారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో బాణసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పులగం వేణుగోపాలరావు, సర్పంచ్ గడ్డం భారతి, గెడ్డం భాస్కరరావు, ఏలూరి సూర్యనారాయణ, చింతపల్లి ప్రసాదు, పోలిశెట్టి నాగులు, మల్లుల ఏసుబాబు, పి.శివన్నారాయణ, కేత నరసింహారావు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకోవాలి

వీరవాసరం: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం కట్టావారి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ కనకమహాలక్ష్మి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని సోమవారం ఆయన మాట్లాడారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆశీర్వచనాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక హోమాలను, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గూడూరు ఓంకారం, గూడూరి ఉమాబాల, గొలగాని సత్యనారాయణ, పేరిచర్ల విజయ నరసింహరాజు, వీరవల్లి కనకమహాలక్ష్మి, వీరవల్లి రాధాకృష్ణ, గుబ్బల శ్రీనివాసు, నూకల కనకారావు, చికిలే మంగతాయారు, ఆలయ కమిటీ పెద్దలు ,యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వెంకటలక్ష్మి బాధ్యతల స్వీకరణ



వెంకటలక్ష్మికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలుపుతున్న అధికారులు

భీమవరం అర్బన్: భీమవరం ఎంపీడీఓగా కె.వెంకటలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో బుట్టాయిగూడెంలో పనిచేసిన వెంకటలక్ష్మి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ రామచంద్రప్రభు బాధ్యతలు నిర్వహించారు. వెంకటలక్ష్మీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టడంతో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొగల్తూరు: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓవ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్సై బి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని కేపీపాలెంకు చెందిన బొడ్డు రామకృష్ణ (45) వేటపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈనెల 10న వేటకు ఉపయోగించే వలను తన ఇంటి డాబాపై ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు, తీవ్రంగా గాయపడిన అతనను కుటుంబ సభ్యులు హుటాహుటిన నరసాపురం తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని, కుమారుడు సాంబశివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైకియాట్రిస్ట్ రమణారావుకు మెడాలియన్ అవార్డు

భీమవరం (ప్రకాశంచౌక్): శాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా)లో గత నెల 22న అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ సదస్సులో భీమవరానికి చెందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ జీవి రమణారావుకు మెడాలియన్ అవార్డు అందించారు. మానసిక వైద్య శాస్త్రంలో గత 35 ఏళ్లుగా వివిధ రంగాల్లో అందించిన సేవలకు గాను, 9 రంగాల్లో చేసిన సేవలకు ఈ గౌరవ అవార్డును అందించారని తెలిపారు. రమణారావును ఐఎంఏ భీమవరం సీనియర్ సభ్యులు డాక్టర్ యిర్రింకి సూర్యనారాయణరావు, అధ్యక్షుడు బాల కృష్ణంరాజు, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలన

సాక్షి, భీమవరం: విద్యార్థులకు చదువుతో పాటు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. భీమవరం పట్టణంలోని పాట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్నం భోజన పథకం వంటకాలను పరిశీలించారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- పేదల చెంతకు ఆధునాతన విద్యావిధానం
- నాడు–నేడుతో స్కూళ్లకు మహర్దశ
- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- నియోజకవర్గంలో పండుగలా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: నాడు–నేడుతో ప్రభుత్వ బడులకు మహర్దశ పట్టిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాల వెలగల నాగ సూర్యకుమారి ఆడిటోయంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ దాసరి హైమావతి, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహాన్‌రెడ్డి విద్యద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని గుర్తించిన ఏకైక నేత జగనన్న అని అన్నారు. తద్వారా విద్యారంగ అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులతో ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు.పేద విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల చదువులు భారం కాకూడదనే ఉద్దేశ్యంతోనే వారికి అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు, వారి పిల్లలకు అవసరమైన స్కూల్ బ్యాగ్స్,బుక్స్, బెల్లు,షూలతో పాటు వారికి అవసరమైన అన్ని వస్తువులను ప్రభుత్వమే ఉచితంగా సమకూరుస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిలిచాయన్నారు. జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లలో కేవలం విద్యారంగానికి కోట్లాది రూపాయల నిధులు ఖర్చుపెట్టారన్నారు. 14 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబుకు పేదలను ఆదుకొవాలని, పేదపిల్లలకు ఉన్నతవిద్య అందించాలనే ఆశ లేదన్నారు. కేవలం దోచుకొని దాచుకో అన్న చందంగా ఆయన పాలన సాగిందన్నారు. కాగా నేడు అమలు కానీ ఎన్నికల మ్యానిఫెస్టోలు ప్రకటించి ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు. జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, బేసిక్ స్కూలు హెచ్ఎం చెక్కా సక్సేనారాజు, ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు కొణతాల, ముప్పిడి సరోజని, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, పార్టీ నాయకులు రెడ్డిసూరిబాబు, ఎంఈవో ఎం. శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, పార్టీ జిల్లా కార్యదర్శి అంజిరెడ్డి, యూత్ అధ్యక్షులు బాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దేవాబత్తుల నాగమణి, ధాన్యలక్ష్మి, దాసరి ప్రవీణ, మాలమహానాడు నాయకులు చీకటిమిల్లి మంగరాజు, పార్టీ సీనియర్ నాయకులు ములగాల బాబ్జి, కొలుకులూరి ధర్మరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు పాఠశాలల ఉపాధ్యాయులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పేదలను విద్యావంతులను చేయడమే జగనన్న లక్ష్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పేద పిల్లలను విద్యావంతులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు మంత్రి కొట్టు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీచేశారు. ఈసందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభించిన మొదటిరోజునే విద్యాకానుకలను అందించడం జగన్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. 2019కి ముందు ధనికుల పిల్లలు కార్పొరేట్ పాఠశాలలకు స్కూల్ బ్యాగులతో వెళుతుంటే అది చూసిన పేద పిల్లలు తాము అలా వెళ్లాలని కలలుగనే వారన్నారు. వారి కలలను నిజం చేస్తూ ముఖ్యమంత్రి జగన్ విద్యారంగానికి పెద్ద పీట వేశారన్నారు. అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, విద్యా వసతి తదితర అనేక సౌకర్యాలు కల్పించారన్నారు. ప్రభుత్వబడి అంటే పేదవాడికి చదువుల వడి అనే విధంగా తీర్చిదిద్దారన్నారు. పాఠశాలలకు ప్రహరీగోడలు, విశాలంగా తరగతి గదులు, గ్రీన్‌కలర్ బోర్డు, డిజిటల్ తరగతులు సాంకేతిక పరిజ్ఞానంతో పాఠాలను వల్లించే విధంగా రూపురేఖలు మార్చారన్నారు. మండల విద్యాధికారి హనుమ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం సత్యనారాయణ, డీవైఈఓ నిమ్మగడ్డ రవీంద్రభారతి, మున్సిపల్ కమిషనర్ అనపర్తి సామ్యూల్, పాఠశాల కమిటీ చైర్మన్ దుర్గాభవాని, నాయకులు జడ్పీటీసీ సభ్యు లు ముత్యాల ఆంజనేయులు, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, కర్ర సుధాకరరెడ్డి, బొద్దాని శ్రీనివాసు, వట్టి బుజ్జి, మారుతి, చామన సూర్యచంద్రరావు, విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

బేసిక్ స్కూలు హెచ్‌ఎంగా సక్సేనారాజు



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందిస్తున్న బేసిక్‌స్కూలు హెచ్‌ఎం సక్సేనారాజు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలకు నూతన హెచ్‌ఎంగా సక్సేనారాజు నియమితులయ్యారు. గుడివాడలోని అంగలూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్లో హెచ్‌ఎంగా పనిచేస్తూ బదిలీపై పెంటపాడు వచ్చారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పాఠశాల విద్యార్థులకు మెరుగైన రీతిలో విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నతులుగా చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్‌ఎం రాజుకు తెలిపారు.

స్పందనకు మూడు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు, పంచాయతీ రాజ్, వెలుగు శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ అందిందని, సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపించినట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. తహసీల్దార్ అప్పారావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డ్రై డే లో ప్రజలు భాగస్వామ్యం, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు కడకట్ల, యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ, బేబి సెంటర్ల్లో ర్యాలీ నిర్వహించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెలంతా మలేరియా మాసోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గృహం వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నియంత్రణ అందరి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయమేరీ, దుర్గ, గంగాభావాని, వాలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని, పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో క్లబ్‌ను జిల్లాలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దారని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. డైమండ్స్ సమావేశం సోమవారం కార్యాలయంలో నిర్వహించారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ డైమండ్స్ మరన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సభ్యులు సమిష్టి కృషితో 900కు పైగా సేవలు అందించడం రికార్డు అన్నారు. పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ డైమండ్స్ నూతన కార్యవర్గ సమావేశం ఈ నెల 20వ తేదీన బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోనా హనుమాన్, కొప్పిశెట్టి రమణయ్య, మద్దూకూరి మెహర్ ప్రసాద్, మునగాల జితేంద్ర, మదన్ మోహన్ అగర్వాల్, మధుసూధనరావు, కె.సాయి సత్యనారాయాణ రాజు, గాదిరాజు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావును సత్కరిస్తున్న డైమండ్స్ సభ్యులు

బాల కార్మికులను తయారు చేయవద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చదువుకునే వయస్సులో పిల్లలను బడికి పంపాలని, వారిని బాల కార్మికులగా తయారు చేయవద్దని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్‌శ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నా మణిలు తల్లిదండ్రులకు సూచించారు. ఛైల్డ్ లేబర్ డే సందర్భంగా సోమవారం లీగల్ అవేర్‌నెస్ క్యాంపు తాడేపల్లిగూడెం మండలంలోని మోదుగుగుంట గ్రామంలో జరిగింది. సూర్య కిరణ్‌శ్రీ మాట్లాడుతూ సంపాదన కోసం పిల్లలను కార్మికులగా చేర్చవద్దన్నారు. ఛైల్డ్ లేబర్ చట్టం ఉందని, పిల్లల హక్కులను కాపాడాలన్నారు. పేదరికంవల్లే పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని, తల్లిదండ్రులు వారి పిల్లలు గురించి ఆలోచించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి, సీనియర్ న్యాయవాది సీహెచ్ ఇజ్రాయిల్ రాజు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ఇరగవరం: మండలంలోని ఖాళీగా ఉన్నా ఒక్క వలంటీర్ పోస్టుకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ తెలిపారు. అయితంపూడి గ్రామంలో ఎస్సీ మహిళ వలంటీర్ పోస్టు నియమాకానికి అర్హులైన ఎస్సీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13వ తేది నుంచి 18వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దండగర్రలో జేవీకే కిట్లు అందజేత



దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న దృశ్యం



విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పాలా శ్రీను, ఉపాధ్యాయ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పత్సా బేబిరాణి, పేరెంట్స్ కమిటి అధ్యక్షురాలు బొమ్ముల శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జగనన్న విద్యాదీవెన సంబరాలు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెంటపాడు ఎస్వీవీఎస్ స్కూల్, నెంబర్–1 స్కూల్, జట్లపాలెం ఎంపీయుపీ స్కూల్, మీనవల్లూరు జెడ్పీస్కూల్లో సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, కొండేపాడు స్కూల్లో సర్పంచ్ దానయ్య, కోరిమిల్లి ప్రాథమిక పాఠశాలలో వల్లూరి బ్రహ్మానందం, సర్పంచ్ వల్లూరి సత్యవతి, రాచర్ల గ్రామంలో సర్పంచ్ వాకా దుర్గాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు చింతన శారద, పరిమెళ్ల గ్రామంలో సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ప్రత్తిపాడు గ్రామంలో పలు ప్రాథమిక పాఠశాలల్లో వీర్ల గోవింద్, ధనరాజు, ముదునూరు, ఆకుతీగపాడు, విప్పర్రు, యానాలపల్లి తదితర పాఠశాలల్లో ఆయా స్కూల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక కిట్లు అందించారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

తణుకు టౌన్: వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుకలను ఆయా గ్రామాల్లోని పెద్దలు, నాయకులు చేతుల మీదుగా ఉపాధ్యాయ సిబ్బంది పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మహాలక్ష్మీ చెరువు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ పాలా శ్రీను, వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, నాయకులు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

విద్యార్థులకు ఉచిత, సబ్సిడీ బస్సు పాస్‌లు సిద్ధం



పీఎస్‌వీఎం సత్య నారాయణమూర్తి

తణుకు అర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఉచిత, సబ్సిడీ బస్సు పాసులు అందిస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. తణుకు డిపోలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంగా విద్యార్థులకు ఆయా కేటగిరీల్లో బస్సు పాసులు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 20 కిలోమీటర్ల పరిధిలో 7వ తరగతి వరకు బాలురకు, 10వ తరగతి వరకు బాలికలకు ఏడాదికి రూ. 50ల రుసుముతో ఉచిత ప్రయాణ పాస్‌లు, అలాగే విద్యనభ్యసించే విద్యార్థులందరికీ 50 కిలోమీటర్ల పరిధిలో సబ్సిడీ బస్సు పాస్‌లు పొందవచ్చని స్పష్టం చేశారు. అర్హులైన విద్యార్థులంతా స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు జెరాక్స్, 10వ తరగతి మార్కుల లిస్ట్ జెరాక్స్‌లను తణుకు డిపోలోని బస్ పాస్ కౌంటర్‌లో సమర్పించి పాస్‌లను పొందవచ్చని సూచించారు. విద్యార్థులంతా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

ఇంద్రజాలికుడు గోపాలరెడ్డికి సత్కారం

తణుకు అర్బన్: తణుకుకు చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు, సైకాలజిస్ట్ బీఎం గోపాలరెడ్డికి హైదరాబాద్ హరిహరభవన్‌లో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించిన భూమంతర్ అనే అంతర్జాతీయ ఇంద్రజాలికుల సమ్మేళనంలో అరుదైన గౌరవం దక్కింది. థాయ్‌లాండ్, పిలిప్పీన్స్, మాల్దీవ్స్, శ్రీలంకలతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన 300 మంది ఇంద్రజాలికుల సమ్మేళనంలో కెమికల్ మ్యాజిక్‌పై ఇచ్చిన లెక్చర్ డెమో, గాలా ప్రదర్శనతో ఇంద్రజాలికులను సైతం అలరించినట్లు గోపాలరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బీవీ పట్టాభిరామ్, జస్టిస్ ఎం.లక్ష్మణ్‌లు ఘనంగా సత్కరించినట్లు వివరించారు. తేతలి హైస్కూలులో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఇంద్రజాలి కులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



హైదరాబాద్‌లో సత్కారం పొందిన గోపాలరెడ్డి

కేజీఆర్ఎల్‌లో మూడు కొత్త కోర్సులు ప్రారంభం

సాక్షి, భీమవరం: పట్టణంలోని కేజీఆర్ఎల్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి మూడు కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల కోశాధికారి గన్నాబత్తుల వెంకట శ్రీనివాస్ చెప్పారు. సోమవారం వివరాలను విలేకరులకు తెలిపారు. జెడ్ఎఫ్‌సీఎస్, ఎంఎస్‌సీఎస్, ఐఎఫ్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. స్టాటిటిక్స్ వల్ల ఫైనాన్షియల్ ప్లానింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధునిక సాంకేతిక విజ్ఞానం ద్వారా కొత్త యాప్‌లను సృష్టించి విద్యార్థులు మేథోశక్తి పెంపొందించుకోవచ్చునన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మెంటే రామ్‌మనోహర్, పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, ప్రిన్సిపాల్ మెంటే హరనాథ్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ

ఉండి: మండలం మహదేవపట్నంలో పునఃనిర్మాణం చేపట్టిన కోదండ రామాలయాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్య అతిధిగా ఈ కార్యక్రమంలో పాల్గొని సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞానం

ఉండి: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కమతం సౌజన్య అన్నారు. సోమవారం ఉండి గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు నిర్వహించారు. 35 రోజుల వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ఎంపీపీ, సర్పంచ్, వెటర్నరీ జేడిఏ వెంకటేశ్వరరావు సంయుక్తంగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ ప్రతిష్ఠ

పెంటపాడు: మండలంలోని కొండేపాడు గ్రామంలో నూతన సాయిబాబా ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిబాబాకి ప్రత్యేక హారతులు అందించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రావిపాడులో:

రావిపాడు గ్రామంలో సాయిబాబా ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించుకొంటున్న అయ్యప్పదేవాలయ శంకుస్థాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

20 శాతం విద్యార్థులు హాజరు

భీమవరం అర్బన్: వేసవి సెలవులు ఆదివారంతో ముగియడంతో సోమవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు తెరిచారు. 20 శాతం విద్యార్థులు హాజరయ్యారని, ఉదయం 8.30 రాగిజావ మధ్యాహ్నం భోజనం పెట్టి పంపించినట్లు మండల విద్యాశాఖాధికారి బి.వినాయకుడు తెలిపారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- రెండోరోజు రాచర్లలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం



రాచర్లలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పథకాల ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సాధికారితే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఏమీ చేయకపోగా నేడు పేదలను కోటీశ్వర్లుగా చేస్తానని, అమ్మకు వందనంలో సొమ్ములు ఇస్తానని, ఉచిత ప్రయాణమని ఇలా ప్రజలను మభ్యపెట్టడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబును గుడ్డిగా నమ్మేవారు రాష్ట్రంలో ఎవరూలేదన్నారు. జగనన్న అన్ని విధాలుగా పార్టీలు, కులమతాలు చూడకుండా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జగనన్న పరిపాలన మీద ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈనెల 14 నుంచి జనసేన నేత పవన్ కల్యాణ్ చేపట్టబోయే వారాహి యాత్ర వల్ల ఒరిగింది శూన్యమన్నారు. నవరత్నాలు పేరుతో అన్ని హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదన్నారు. హామీలు ఇచ్చిన రోజునుంచే అమలు చేయడం జగనన్న నైజమని కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాకా దుర్గాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు చింతన శారద, మాజీ సర్పంచ్ డోకల కమలాకర్, ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, బూరాడ శ్రీను, దేవ వెంకటరమణ, కుంచే సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు రెడ్డి సూరిబాబు, పెన్నాడ సూరిబాబు, నల్లమిల్లి విజయానందరెడ్డి, తహసిల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పలు శాకల ఏఈలు నవీన్, పార్థసారధి, వైస్ ఎంపీపీలు ముప్పిడి సరోజని, కొణతాల వెంకట్రావు, ములగాల రామసత్యనారాయణ, మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.